# సింగిల్ పేజీ కథ

## పిక్చర్ ట్యూబ్ పోయింది

సుబ్బారావు ఇంట్లో టీవీ చెడిపోయి రెండురోజులయ్యింది. అయినా సంవత్సరాలయినట్లు ఇంట్లో పరిస్థితి విషమించడంతో ఆ నెల బడ్జెట్ ఖర్చులకు మిగుల్చుకున్న ఏడువందల రూపాయలను పట్టుకుని గ్యారంటీ కార్డుతో బయలుదేరాడు విధిలేక సుబ్బారావు.

ఆ షాపు యజమాని సుబ్బారావుని సాదరంగా ఆహ్వానించి కూర్చోబెట్టి, లోపల సర్వీసింగ్ సెక్షన్లోంచి మెకానిక్ని పిల్చాడు. అతను సుబ్బారావు టీవీ పట్టుకుని లోపలికి పోయి ఓ పది నిముషాల తర్వాత వచ్చి చెప్పాడు టీవీకి పిక్చర్ ట్యూబ్ కాలిపోయిందని! అది విన్న సుబ్బారావుకి ఒక్కసారిగా నీరసం ఆవహించేసింది. గ్యారంటీ కార్డు, బిల్లు చెక్ చేసిన ఆ షాపు ఓనరు,

''యూ ఆర్ లక్కీ సార్! గ్యారంటీ పీరియడ్కి పదిరోజులు ముందుగానే మీ టీవీకి ట్యూబ్ పోయింది. కాబట్టి ఫర్వాలేదు. ట్యూబ్ మార్చేస్తాడు. ఒక అర్ధగంట వెయిట్ చెయ్యండి'' అన్నాడు. ఆ మాటలకు సుబ్బారావు ఎగిరి గంతేసినంత పని చేయబోయి వెంటనే నిభాళించుకుని తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు.



ఓ పావుగంట గడిచాక సుబ్బారావుని లోపలికి పిలిచాడు టీవీ మెకానిక్. టీవీ ఎలా పనిచేస్తుందో చూపించడానికి కాబోలు అనుకుంటూ సుబ్బారావు ఆతృతగా వెళ్ళాడు లోపలికి! లోపల టీవీకి వేటికవి పీకేసి చెల్లాచెదురుగా ఉంచిన పార్టుల్ని చూసిన సుబ్బారావుకి మతిపోయినంత పనయ్యింది.

''పిక్చర్ ట్యూబ్ మార్చాలి సార్! బొమ్మసరిగ్గా రావటం లేదు. మొన్న మధ్యాహ్నం మీ ఏరియాలో పిడుగుపడింది కదా వైర్ డిస్కనెక్టు చేయలేదా?'' అంటూ ఆరాతీసాడు మెకర్.

''అసలు మొన్న ఉదయం నుంచీ సాయంత్రం దాకా టీవీ ఆన్ చేస్తే కదా! పైగా కరెంట్ వైరుతోపాటు కేబుల్ వైర్ని కూడా డిస్ కనెక్టు చేసామాయె''

''ఏసీ. ఓవర్ ఓల్టేజ్ ప్రాబ్లమ్ అయి ఉంటుంది లెండి! ట్రాన్స్ఫార్మర్, కంట్రోల్ స్విచ్, ఛానెల్ స్విచ్ మరికొన్ని ఇతర పార్టులు కాలిపోయాయ్. ట్యూబ్కి తప్ప పార్టులకి గ్యారంటీ పీరియడ్ దాటిపోయింది కదా! ఇవిగో ఈ పార్టులు పడతాయ్. సర్వీసింగ్ చార్జీతో పన్నెండు వందల రూపాయిలవుతుంది'' అంటూ తాపీగా సెలవిచ్చి ఆ లిస్ట్ అందించాడు సుబ్బారావుకి! నాలిక తడారిన సుబ్బారావు గుటకలు మింగుతూ,

''పన్నెండొందలే! నాదగ్గర ఏడువందలే ఉన్నాయి. ఏదోలా అడ్జస్ట్ చేసి బాగుచేయండి'' అన్నాడు బేరమాడే ధోరణిలో!

''లేదుసార్! నేను రాసిచ్చిన పార్టులన్నీ పడాలి. అన్నీ వేయాలి. ఏ ఒక్కటి తగ్గించినా టీవీ సరిగా పనిచేయదు. ఏదో పదో ఇరవయ్యో అంటే నా సర్వీసింగ్ ఛార్జీలో తగ్గించుకుంటాను. వందలమీదంటే అవ్వదు'' నిర్మొహమాటంగా లేకుండా చెప్పేశాడు అతడు.

''సరే. చేసేయండి. నా తంటాలేవో నేను పడతాను. ఒక గంటలో వస్తాను'' అంటూ బయటపడ్డాడు సుబ్బారావు. అప్పటికప్పుడు ఆఫీసులో తన పక్కసీటయినపరమేశ్వరం ఇంటికెళ్ళి, తన పర్సనల్ మేటర్ని, మధ్యతరగతి కష్టాలని చెప్పుకుని ఓ ఆరువందలని అతడినుంచి అప్పుగా తీసుకుని టీవీషాపుకు చేరుకున్నాడు. షాపులోకి అలా అడుగు పెట్టగానే లోపల టీవీ పనిచేస్తూ దర్శనమిచ్చింది సుబ్బారావుకి! డబ్బు చెల్లించి, టీవీ విడిపించుకుని ఇల్లు చేరుకున్నాడు.

ముచ్చటగా ముప్పయ్రోజులు గడిచాయ్. ఆరోజు సాయంత్రం సుబ్బారావు ఆఫీసునుంచి వచ్చాడు. ఇంట్లో టీవీ మోగటానికి బదులు పిల్లల గోలలు, అరుపులు వినిపించాయ్.

''టీవీకి ఏం చేయించారండి రిపేరు? పన్నెండొందలు ధారబోసారు. మధ్యాహ్నం నుంచి అసలు ఉలకటం పలకటమే మానేసింది'' అంటూ సుబ్బారావు సతీమణి విసుక్కుంది. ఈలోపు పిల్లలు కంచాల ముందు రాస్తారోకోలు, మంచాలపై బందులు నిర్వహించడం కంటిన్యూ అవుతుండింది. ఓరినాయనో! అనుకుంటూ రయ్న పరిగెత్తి ఆ టీవీ బాగుచేసిన మెకానిక్ని ఎలాగో బ్రతిమిలాడి నేరుగా ఇంటికి తీసుకొచ్చాడు సుబ్బారావు.•

అతడు అదీ ఇదీ కాసేపు కెలికి-

''లాభం లేదు సార్! మీ ఏరియాకి ఓవర్ ఓల్టేజ్ ప్రాబ్లమ్ ఎక్కువగా వుంది. పైగా మీ టీవీకి స్టెబిలైజర్ కూడా లేదు.''

''అదిసరే! ముందు దీనికేమయ్యిందో అది చెప్పండి'' అడిగాడు టెన్షన్ పడిపోతూ సుబ్బారావు.

''పిక్చర్ ట్యూబ్ కాలిపోయింది.''

''ఆ!'' అంటూ దభేలున పడిపోయాడు సుబ్బారావు. ఇదివరకే అతని ఇంకా ఉన్న ట్యూబ్ని కొట్టేసి డూప్లికేటు ట్యూబ్ని వేసిన సంగతి, ఇప్పుడా ట్యూబ్నే మళ్ళా తనకే తగిలించాలని ట్రయల్స్ వేస్తున్న మెకానిక్ ఆంతర్యం సుబ్బారావుకేం తెలుసు. తెలిస్తే ఇంకేం అయిపోయేవాడో, పాపం సుబ్బారావు!

-శ్రీశైలపురామకృష్ణ (నర్సీపట్నం)